ప్రజాశక్తి

సోమవారం 5, డిసెంబర్ 2022

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శిగా లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన బాబావలి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పుట్టపర్తిలో ఈ నెల 3వ తేదీన జరిగిన జిల్లా మహాసభలో 19మందితో నూతనంగా కమిటీ ఎన్నుకున్నారన్నారు. తనను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా నాలుగసారి అవకాశం కల్పించారన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలను చేస్తామని చెప్పారు.

సదస్సులో మాట్లాడుతున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ చంద్రశేఖర్

విద్వేష రాజకీయాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

ప్రజా చైతన్యంతోనే ఫాసిస్ట్ పాలకులకు స్వస్తి

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశం, రాష్ట్రంలో నెలకొన్న విద్వేష రాజకీయాలతో వారి స్వార్థం నెరవేర్చుకోవచ్చే తప్ప.. ప్రజాస్వామ్యానికి మాత్రం పెను ముప్పుకు గురిచేస్తాయని పలువురు వక్తలు అన్నారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎపి ఎన్జీవో హోంలో 'విద్వేష రాజకీయాలు-ప్రజాస్వామ్యం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రతినిధి రవిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బోస్ ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజల సమ్మతం మేరకు పరిపాలన సాగడం లేదన్నారు. పాలకులు స్వార్థ రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలపెట్టారన్నారు. అధికారంలోకి వస్తే ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తాం, జన్‌ధన్ ఖాతాల్లో నల్లధనం తీసుకొచ్చి జమచేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోడీ మాట మరిచారన్నారు. జి 20 గ్రూపు దేశాలకు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.. విశ్వగురువుగా ఎదిగామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప దేశానికి చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత విద్వేషాలు సృష్టించి ముస్లిం సామాజిక వర్గంపై పెనుదాడి జరుగుతోందన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతిస్తూ బిజెపి తన పబ్బం గడుపుకుంటోందన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ దాడులు, హింసలు, హత్యలు వంటి అప్రజాస్వామిక విధానాలు అమలు చేస్తోందన్నారు. బిజెపి వెనుక 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్ఎస్ఎస్ ఉన్నంత కాలం ఇలాంటి పద్ధతుల్లో ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతూనే ఉంటాయని తెలిపారు. అధికార, ప్రతిపక్షాలు కూడా మోడీకి మోకరిల్లుతున్న దౌర్భాగ్యం రాష్ట్రంలో ఏనాడూ లేదన్నారు. ప్రజల పక్షాన నిలబడే వారిని బలపరచి ప్రజాస్వామ్య సుస్థిరతకు తోడ్పడుదామన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా మాట్లాడుతూ అసమర్థ పాలకులు అధికారంలోకి వచ్చి అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు మేలుకోకపోతే రాజ్యాంగ ఉనికి, విలువలు నాశనం అవుతాయని హెచ్చరించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బోస్ మాట్లాడుతూ దేశంలో సామాజక అసమానతలు నెలకొన్నాయన్నారు. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థలను తొలగించినప్పుడే నిజమైన సమానత్వం వస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలుచేసే నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు శ్రీకారం చడుదామన్నారు. అందులో భాగంగా ప్రజా చైతన్యం కోసం కళాసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్, గాంధీ తదితర మహనీయుల ఆశయాలపై కళా ప్రదర్శనలు ఉంటాయని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, మానవత తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అబ్దుల్ రసూల్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కమిటీ నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా, ప్రకాష్, మసూద్, ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, రామాంజినేయులు, ప్రజాశక్తి సాహితీ సంస్థ మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇన్‌ఛార్జి మురళి, సిటీ ఇన్‌ఛార్జి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తిపంట సాగు చేసిన రైతు పూర్తిగా చిత్తయ్యాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం పత్తి పంట ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగైంది. వేరుశనగ గిట్టుబాటుకాని పరిస్థితుల్లో పత్తి పంటవైపు క్రమంగా రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతూపోతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 1.11 లక్షల ఎకరాల్లోపే ఉంది. అయితే ఈ ఏడాది 200291 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. అంటే దాదాపు రెండింతలు పత్తి పంట సాగైంది. ప్రత్యేకంగా అనంతపురం జిల్లా వకు చూస్తే సాధారణ సాగు ఈ ప్రాంతంలో 1.11 లక్షల ఎకరాలు అయితే 1.90 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే సాధారణం కంటే 171 శాతం పత్తి పంట సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణంగా 1712 ఎకరాల్లో సాగు అయ్యేది. ప్రస్తుతం పది వేల ఎకరాల్లో సాగు అయింది. ఈ జిల్లా పరిధిలో ఒకేసారి 523 శాతం పత్తి సాగు పెరిగింది.

దిగుబడుల దిగాలు..

ఎకరానికి విత్తనం మొదలుకుని పత్తి పంట తొలగించే వరకు ఎకరానికి సగటున రూ.50 వేల వరకు ప్రతి రైతూ ఖర్చు పెట్టాడు. ఎకరానికి సగటున ఎనిమిది నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. కానీ చాలా చోట్ల మొగ్గలే ఏర్పాటవలేదు. మరికొన్ని చోట్ల మొగ్గ వచ్చినా అందులో పురుగు ఉండటంతో లోపల మొత్తాన్ని తినేయడంతో పత్తి ఏర్పడక పూర్తిగా దిగుబడి పోయింది. దిగుబడి ఏ మాత్రం చేతికందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో పత్తి రైతులు ఆందోళనలో ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నేడు ఎపి రైతు సంఘం ధర్నా

విత్తనాలు..ప్రకృతి వెరసి రైతుకు నష్టం

జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున పత్తి పంట దెబ్బతినడానికి విత్తనాలు, ప్రకృతి రెండింటి వల్ల నష్టం జరిగిందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. నష్టం జరిగిన ప్రాంతాల్లో రెండు బృందాలు జిల్లాలోని తాడిపత్రి, పామిడి ప్రాంతాల్లో పర్యటించాయి. వారు పరిశీలించిన అంశాలను నివేదిక రూపంలోనూ అందజేశారు. ఇందులో విత్తనాల నాణ్యతాలోపాలూ ఉన్నట్టు కొన్నిచోట్ల గుర్తించారు. ప్రధానంగా అరికార రకం విత్తనంలో లోపాలున్నట్టు గుర్తించారు. మరోవైపు వర్షాలు అధికమవడం మూలంగానూ ప్రధాన నష్టం జరిగిందని అంచనా వేశారు. 70 రోజుల వ్యవధిలోనే 20 రోజుల్లో 300 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. అధిక వర్షాలు, తేమ శాతం అధికమవడం మూలంగా 50 శాతం దిగుబడి పడిపోవడానికి కారణమని అంచనా వేశారు. ప్రధానంగా మూడు కోతల్లో పత్తి పంట దిగుబడి వస్తుందని నివేదికలో పేర్కొన్నారు. అందులో మొదటి కోతలో 50 శాతం, రెండో కోతలో 30 శాతం, ఆఖరి కోతలో 20 శాతం దిగుబడులు వస్తాయి. అయితే అకిరా రకంలో చూస్తే మొదటి కోతలో సున్నా నుంచి గరిష్టంగా ఒక క్వింటాళు దిగుబడి మాత్రమే వచ్చింది. ఇతర రకాల్లో మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చినట్టు గుర్తించామని శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

నేడు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సిపిఎం మద్దతు

నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆందోళనకు సిపిఎం మద్దతు తెలుపుతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విత్తనాల నాణ్యత, ప్రకృ వైపరిత్యాలు రెండింటి మూలంగా పత్తి రైతులు పూర్తిగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై జరిగే ఆందోళనకు అందరూ మద్దతు తెలుపాలని కోరారు.

పుట్లూరు మండలంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు (ఫైల్ ఫొటో)

నకిలీ విత్తనాలే ముంచాయా..

జిల్లాలో ఈ ఏడాది పత్తికి డిమాండ్ పెరగడంతో నకిలీ విత్తనాల జోరుగా సాగింది. ఖరీఫ్‌లో జిల్లాలో సాగైన వాటిల్లో అత్యధికంగా బయటి ప్రాంతాల నుంచి అనుమతుల్లేకుండానే కొంత మంది తెప్పించి అధిక ధరలకు రైతులకు అంటగట్టారు. ఈ పంట వేసి రైతులు నష్టపోయారు. ఇప్పుడు కొంత మంది రైతుల వద్ద విత్తనాలకు సంబంధించి బిల్లులు కూడా లేకపోవడంతో గట్టిగా విత్తన కంపెనీలను ప్రశ్నించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

వికలాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఎస్.అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వికలాంగులను, వయోవృద్ధులను, హిజ్రాలను, సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడిన వారిని ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం ఎన్నో నూతన పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతి కోసం తోడ్పాటు నిస్తోందని ఉమ్మడి అనంతపురం జిల్లాల విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఎస్ అబ్దుల్ రసూల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ఉమ్మడి జిల్లాలలో విబిన్న ప్రతిభావంతుల ప్రోత్సాహం గురించి వివరించండి ?

జవాబు : ప్రస్తుతం అనంతపురం శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి కోసం అనంతపురంలోనే జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశాం. ఇక్కడి నుండి కార్యకలాపాలు కొనసాగుతున్నాం. శ్రీ సత్యసాయి జిల్లాలో కార్యాలయం త్వరలో ఏర్పాటు చేయనున్నాం. ప్రస్తుతం ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా శనివారం నాడు డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు ఉండగా వారిలో ఐదుగురికి ట్యాబులను పంపిణీ చేశారు. ట్రై సైకిళ్లను ఐదుగురికి అందజేశారు.

ప్రశ్న : విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మీరు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమి ?

జవాబు : ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన రెండు పథకాలు అమలులో ఉన్నాయి. డిగ్రీ, డిప్లొమా అంతకంటే ఎక్కువ తరగతులు చదువుతున్న విద్యార్థులకు 40 శాతం, అంతకంటే ఎక్కువ అంగవైకల్యం కలిగివుండి తల్లీదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించని విద్యార్థులకు వీటిని మంజూరు చేస్తున్నాం. వీటిని పొందగోరు వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న : విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారా ?

జవాబు : ఏపీ ప్రభుత్వం 2002 నుండి వికలాంగుల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ ఏర్పాటు చేశారు. 2020 సంవత్సరంలో నాలుగు శాతం రిజర్వేషన్ పెంచిందని. 1:1:1: 1 నిష్పత్తి ప్రకారం దృష్టిలోపం, వినికిడి లోపం, వైకల్యం, ఆర్టిజన్, మేధావైకల్యం, అన్ని ప్రభుత్వ సంస్థలలో నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మానసిక అనారోగ్యం, బహుళ వైకల్యం ఉన్నవారికి ఈ సంవత్సరం నుండి బ్యాక్‌ల్యాగ్ పోస్టులు ఇవ్వనున్నాం. వాటికి ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీచేస్తాం.

ప్రశ్న : అందుల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏంటి ?

జవాబు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో అందుల కోసం రెండు హాస్టళ్ల ఉన్నాయి. వాటిలో 150 మంది ఉన్నారు. వారిలో 100 మంది బాలురు 50 మంది బాలికలు ఉన్నారు. అందుల కోసం గృహం, హాస్టల్లో, గృహ ఖైదులకు ఉచితంగా వసతి, ఆహారం కాస్మెటిక్ ఛార్జీలు ఇస్తున్నాం. వయోవృద్ధులకు కొన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్రశ్న : వికలాంగులకు ఇస్తున్న ప్రోత్సాహకాలేమి ?

జవాబు : వికలాంగులకు, వయోవృద్ధులకు, విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి జాతీయ ఉపకార వేతనాలు, ట్రై సైకిల్ చక్రాల కుర్చీలు, త్రీ వీలర్లు క్లచస్సు, కాలిపర్లు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్, ప్లేట్లు వంటి వివిధ సహాయక ఉపకరణాలు అందిస్తోంది. డిప్లొమా, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు, ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న వారికి ట్యాబ్‌లు అందిస్తున్నాం.

గడినాడులను ఆదుకుంటాం

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి

ప్రజాశక్తి మడకశిర

మాట్లాడుతున్న కర్నాటక మాజీ ముఖ్యమంత్రి

రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలోని గడినాడులను అన్నివిధాలా ఆదుకుంటామని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి అన్నారు. కర్నాటక ప్రాంతం పావగడలో జరిగే ప్రచార యాత్ర కార్యక్రమానికి ఆదివారం వెళుతున్న కుమారస్వామి మడకశిరలో ఇక్కలిగలతో ముచ్చటించారు. మడకశిర నియోజకవర్గం వక్కలిగ సంఘం అధ్యక్షులు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు ఆధ్వర్యంలో కుమారస్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ సంఘం నాయకులు నాగరాజు ఉగ్రప్ప, కాంతరాజు, జై సింహా తదితరులు పాల్గొన్నారు.

కళాశాల మిత్రులతో సరదాగా...

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని నీలకంఠాపురం గ్రామంలోని హై స్కూల్ వద్ద మాజీమంత్రి రఘువీరారెడ్డి కళాశాల మిత్రులతో ఆదివారం సరదాగా కాసేపు గడపారు. తనతో పాటు మడకశిర పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన మిత్రులతో కలిసి నీలకంఠేశ్వర స్వామి దేవాలయం వద్ద ఉయ్యాలు ఆడుతూ సరదాగా గడపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రులు క్షేమ సమాచారం తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి రఘువీరా మాట్లాడుతూ పూర్వ మిత్రులతో కలవడం సంతోషంగా ఉందని అన్నారు.

మిత్రులతో కలసి ఊయల ఊగుతున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

రహదారులు అభివృద్ధికి చిహ్నాలు

వర్చువల్ విధానంలో రహదారి పనులను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము

ప్రజాశక్తి-బుక్కపట్నం

రహదారులను అభివృద్ధి చేయడం ద్వారానే ఆయా ప్రాంతాల అభివృద్ధి చెంది పరిశ్రమలు ఏర్పాటవుతాయని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్‌హెచ్ 342 లో భాగంగా 32 కిలోమీటర్ల పనులను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విజయవాడలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బుక్కపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవతో సత్యసాయి జిల్లాలో రూ.175కోట్లతో రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడత ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వరకూ రెండు లైన్లు అభివృద్ధి పనులరు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే సెప్టెంబర్ 23వతేదీలోపు నియోజవర్గంలోని 193 చెరువులకు రూ.వెయ్యి కోట్లతో చెరువులు నింపే కార్యక్రమం చేపడతామన్నారు. గత పాలకులు అభివృద్ధిని మరిచి ప్రజలను మభ్య పెట్టారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో సిఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో గాజులపల్లి, నల్లగొండలో రెండు రిజర్వాయర్లను ఏర్పాటు చేసి అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం డైట్ కళాశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌డి మధుసూదన్‌రావు, సర్పంచులు నాగలక్ష్మి రాజు, రూప, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపిపి పార్వతి రత్నాకర్, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు కొత్తకోట కేశప్ప, కేశప్ప, నారాయణస్వామి, రామలింగారెడ్డి, అధికారులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ఘనంగా ఘంటసాల జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

గాన గంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని ఆదివారం నిర్వహించారు.కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా పార్కులో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది సి రామచంద్ర రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి కె సుదర్శన్, సీనియర్ అడ్వకేట్ మల్లికార్జున, ప్రముఖ వ్యాపారవేత్త నమోదు శంకర్, రిటైర్డ్ ఎస్సై లోకేష్, ఆంజనేయులు, కళాకారులు రంగనాథ్, మంజుళ, ప్రసాద్ రావు, బేబీ భారతి, జర్నలిస్టులు నాగరాజ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన అధికారి పేరుతో వ్యక్తి హల్‌చల్

ఫిర్యాదు చేసిన స్టోర్ డీలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని చౌక దుకాణాల వద్ద నాలుగు రోజుల నుంచి ఓ వ్యక్తి ఫోటోలు, విడియోలు తీసి డీలర్లకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ప్రశ్నించిన డీలర్లకు తాను జిల్లా కలెక్టర్ కార్యలయంలో ఇంటెలిజన్స్ విభాగంలో పరిశీలన అధికారిగా పని చేస్తున్నానని తన పేరు శ్రీరామ్ నాయక్ అని చెబుతున్నాడు. డబ్బులు ఇవ్వక పోతే ఫోటోలు, విడియోలు కలెక్టర్‌కు ఇచ్చి రేషన్ దుకాణాలు మూసి వేస్తామని బెదిరిస్తూ కొంత మంది వద్ద వసూళ్లకు పాల్పడ్డాడు. దీంతో స్టోర్ డీలర్స్ అసోసియేషన్ రెండవ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలను సేకరించిన పోలీసులు శ్రీరామ్ నాయక్ అనే వ్యక్తిపై కేసును నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

లీగల్ మెట్రాలజీ డిజిపిని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెండేయ స్వామి దేవాలయం లో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ డిజిపి కిశోర్ కుమార్‌కు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంఆ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఉద్యోగ కల్పన సరే.. పనికి తగిన వేతనం ఏదీ..?

ఉపాధి పేరుతో కంపెనీల ఘరానా మోసం

కంపెనీ కార్యకలాపాలు కార్మికశాఖ సహాయ అధికారికి తెలియని దుస్థితి

కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇలాంటి ప్రాంతంలో కంపెనీలు లేకపోవటంతో ఉన్నత చదువులు చదివి ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, డిగ్రీ చదువులు చదివి ఉద్యోగాలు కోసం హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, వంటి నగరాలకు ఉద్యోగం కోసం ఎంతోమంది యువతీ యువకులు వెళ్తున్న దుస్థితి. ఇలాంటి పరిస్థితులలో కదిరి పట్టణంలో మదనపల్లి రోడ్డులో ఎటిడి, బైపాస్ రోడ్ గర్ల్స్‌కాలేజ్ ఎదుట విట్రాక్‌వర్డ్, ఎమ్ఎన్‌సి కంపెనీలు నడుపుతున్నారు. అయితే ఆ రెండు కంపెనీలు అనుమతులు లేకుండా ఎలాంటి నిబంధనలు పాటించకుండా నడుపుతున్నట్లు సమాచారం. విట్రాక్ రెండు సంవత్సరాల పై బడి, మరొక కంపెనీ అయిన ఎటిడి 6 నెలలుగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నా కంపెనీ కొనసాగిస్తున్నట్లు ఇంతవరకు తన దృష్టికి రాలేదని సహాయ కార్మిక అధికారి చెప్పడం విడ్డూరంగా ఉంది. ఈ రెండు సంస్థల్లో దాదాపు 90మంది యువతీ యువకులు పని చేస్తున్నారు. సంస్థల్లో పనిచేస్తున్న వారందరికి సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు సంస్థలు ధ్రువపత్రం ఇవ్వకుండా, కార్మిక శాఖ నిబంధన మేరకు కనీస వేతనచట్టాన్ని అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాయన్న విమర్శలున్నాయి. 3 నెలలు లేక,100 రోజులు లోపు గాని ప్రయివేటు యాజమాన్యం కింద పని చేస్తే ఆ సిబ్బందికి నిబంధన ప్రకారం వారికి ఫారం ఎస్‌ను అందజేయాలి. చట్టం ప్రకారం కనీస వేతనం 18వేల రూపాయలతో పాటు, సంస్థ ఆదాయంలో సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ కొరకు కొంచెం చెల్లించి, సిబ్బంది వేతనంలో కొంత నగదును ప్రావిడెంట్ ఫండ్ రూపంలో కట్టాలి. అలాగే సిబ్బందికి పిఎఫ్, ఇపిఎఫ్, జిపిఎఫ్ చెల్లించాలి. ఇందుకుగాను ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ చెల్లించాలి, ఏదైనా ప్రైవేటు సంస్థ సిబ్బందికి సంవత్సరానికి ఒక సారి బోనస్ చెల్లించాలి. వేతనం ఇచ్చే సమయంలో అక్విటీన్స్ రిజిస్టర్ లో సంతకాలు తీసుకోవాలి, పేస్లిప్ ఇవ్వాలి. పైగా ఉద్యోగికి చేతికి ద్వారా కాకుండా బ్యాంకు నుండి వేతనాలు చెల్లించాలి. ఈ నిబంధనలను తప్పనిసరి పాటించాలి. కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించే సమయంలో ఉద్యోగి వాహనాల పార్కింగ్ స్థలం. కంపెనీ కార్యకలాపాలకు వెయ్యి గజాల స్థలం తప్పనిసరిగా ఉండాలి. కంపెనీ కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులు పత్రాలు కార్మిక శాఖ అధికారికి సమర్పించాలి. స్థానిక సహాయ కార్మిక అధికారి సంస్థ కార్యకలాపాలు కొనసాగించే భవనంలో పాటు సిబ్బంది కొరకు కనీస మౌలిక వసతులను పరిశీలించాలి. సంస్థలు రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరి చేయించాలి. సంవత్సరానికి ఒకసారి సంక్షేమ నిధి కార్మికుల పేరుతో కట్టించుకోవాలి. వీటిలో ఏమైనా లోపాలుంటే యాజమాన్యాన్ని హెచ్చరించాలి. లేదా సమస్య తీవ్రతను బట్టి తక్షణమే చర్యలు తీసుకోవాలి. అయితే ఇక్కడ ఇవేవీ జరగడం లేదు. కార్మికులకు చాలీచాలని వేతనాలిస్తూ అధికవేతనాలు ఇస్తున్నట్లు తప్పుడు లెక్కలు చూపిస్తూ మూడు సంవత్సరాలుగా సిబ్బంది శ్రమను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే కదిరిలో సహాయ కార్మిక శాఖ అధికారి ఉన్నట్లా లేనట్లా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. కార్మికుల కడుపుకొట్టడంలో యాజమాన్యానికి సహాయ కార్మిక అధికారి సహకరిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించని కంపెనీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అంశంపై తహశీల్దార్ కి ఫిర్యాదు చేస్తే అవినీతికి పాల్పడిన రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు అరుణ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కంపెనీల యాజమాన్యం , సహాయ కార్మిక అధికారి పైన చర్యలు తీసుకోవాల్సింది పోయి రాయలసీమ విద్యార్థి యువజన సంఘం నాయకులను బెదిరిస్తున్నారని నాయకులు విమర్శిస్తున్నారు. 'మీమీద కంపెనీ యాజమాన్యం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీరిక్కడే ఉండండి' అని బెదిరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొత్తచెరువు : ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమనిఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి తెలిపారు కొత్త చెరువులోనే వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం నిర్వహించిన నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం నల్లమాడ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా సి శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణవేణమ్మ, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, సర్పంచి రాధా నాగరాజు, వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, నాగభూషణ్, శ్యాంసుందర్ రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎపిఎల్ పోటీలలో కదిరి జట్టు విజయం

కదిరి టౌన్ : ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంత ప్రీమియర్ లీగ్ అండర్ -18 బాలికల క్రికెట్ పోటీలలో కదిరి జట్టు విజయం సాధించింది. ఈజట్టు నార్పల జట్టును 8 వికెట్ల తేడాతో ఓడించి లీగ్ లో వరుసగా మూడవ విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కదిరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేశారు. సారథి అర్షియా మరోసారి ప్రతిభ కనబరచి 69 పరుగులతో సత్తా చాటారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన సాధన స్కూల్ హెడ్ మాస్టర్ సాదిక్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఇటి సుధాకర్, గౌస్ పీర్, నరసింహ మూర్తి, మనోహర్, విజయకుమార్, ముబారక్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కదిరి టౌన్ : కదిరి శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి ఇతర కార్యక్రమాల నిర్వహణ కొరకు ఎమ్మెల్యే పి వి సిద్ధారెడ్డి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. టెంపుల్ డైరెక్టర్ మల్లిఖార్జున, వైసిపి నాయకులు మణికంఠ నాయక్ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండల పరిధిలోని చెరువువాండ్ల పల్లికి చెందిన బాధితుడికి దాతలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన అబ్బోల్ల వేమన్న, గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన విషయాన్ని తెలుసుకున్న తిరుపతి మంచాల వీధికి చెందిన డాక్టర్ బిఎన్ లలిత్ చంద్ర, టీమ్ సభ్యులు 45 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పూల శ్రీనివాసరెడ్డి

కదిరి టౌన్ : కదిరి నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో సిఇసి సభ్యులు పూలశ్రీనివాసరెడ్డి ఆదివారం పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో తలుపుల మండలం కొరుగుట్ట పల్లి కి చెందిన బాలక్రిష్ణ కుమారుడు చౌడప్ప వివాహం వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అలాగే స్థానిక పివిఆర్ గ్రాండ్‌లో నల్లమాడ మండలం దొన్ని కోట కు చెందిన బసి రెడ్డి కేశవ రెడ్డి కుమార్తె శోభిత రెడ్డి వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పరిగి : గ్రంథాలయాల విద్యార్థులకు విజ్ఞాన కేంద్రాలని వాటిని సద్వినియోగం చేసుకుంటే మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు బాగా తోడ్పడతాయని ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌బాబు తెలిపారు. మండలంలోని కోడిగినహళ్లి కేంద్రంగా భగత్ సింగ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ కేంద్రాన్ని ఎస్ఐ నరేంద్ర తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇలాంటి గ్రంథాలయం ఏర్పాటు చేసి అనేక విజ్ఞానవంతమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలింగప్ప, వెంకటేష్, భగత్ సింగ్ సేవా సమితి సభ్యులు కార్తీక్, హరి, మంజునాథ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అమడగూరు : మండలంలోని గాజులపల్లి సమీపంలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో గల్ఫ్ అండ్ ఇండియా గ్రూప్ వైసిపి యువ నాయకులు ఉమా మహేష్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. వృద్ధులకు 25 కేజీల బియ్యం ప్యాకెట్లు, 30 కేజీల కందిబేడలు, 25 కేజీల వంట నూనె, కొత్త బట్టలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

చిలమత్తూరు : మండలంలోని దెమకేతేపల్లిలో రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణ గుండె, షుగర్ క్లినిక్ సిబ్బంది ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ నరసింహా రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచి తిరుమేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది.

శరీర దృఢత్వానికి యోగా ఉపయోగకరం

పుట్టపర్తి అర్బన్ : మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని యోగా గురువు నారాయణరెడ్డి చెప్పారు. 15 రోజులుగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాధవి, యోగా గురువు కృష్ణ, వైద్యులు నవీన్, రాజేంద్ర, తిరుపతి రావు, పరమేష్, సాంఘిక సంక్షేమ వసతి గృహం అధికారి మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.

రాయలసీమ గర్జన పోస్టర్లు ఆవిష్కరణ

కదిరి టౌన్ : డిసెంబర్ 5న కర్నూలులో రాయలసీమ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాయలసీమ గర్జన పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి ఆదివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానుల బిల్లును ప్రవేశపెట్టారన్నారు. పాలనా వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయన్నారు. జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వికేంద్రీకరణ బిల్లుకు మద్దతుగా రాయలసీమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ గర్జనకు వైసిపి పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచులు కుర్లి శివారెడ్డి, రవీంద్ర నాయక్, దేవేంద్ర నాయక్, మాజీ సర్పంచి నరసింహారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్ సూట్లు అందజేత

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండల పరిధిలోని ఎరుకులవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో గత పది రోజులుగా శిక్షణ పొందుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 15 మంది హ్యాండ్ బాల్ క్రీడాకారులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్ ఆదివారం క్రీడా సామాగ్రి, ట్రాక్ సూట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో ఈనెల 5,6వ తేదీల్లో 37వ ఏపీ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమవంతుగా ఈ ట్రాక్ సూట్లను అందజేశామని తెలిపారు. క్రీడాకారులకు పది రోజులపాటు తమ పాఠశాలలో భోజనం, వసతి సదుపాయం కల్పించి అన్ని విధాన సహకరిస్తున్న స్కూల్ నిర్వాహకులు కిరణ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బలరాం రెడ్డి, కమల్‌బాషా, వైసీపీ నాయకులు కుర్లి శివారెడ్డి. షాను ఇబ్రహీం, షేక్ ఇబ్రహీం, వ్యాయమ ఉపాధ్యాయులు ఖాదర్ వలీ, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో నాయకులు

కన్నులపండువగా కుంభాభిషేకం

కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెట్ వీధిలోగల మార్కెండేయ స్వామి ఆలయంలో విగ్రహప్రతిష్టాపన, కుంభాభిషేక కార్యక్రమాలు ఆదివారం కన్నులపండువగా జరిగాయి. శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావన రుషీంద్రులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ కుంభాభిషేకానికి హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు, కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ డీజీపీ కేఆర్ఎం కిశోర్ కుమార్, ధర్మవరం, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శిచిలకం మధుసూదన్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ కమిటి సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసులు, శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షుడు జింకా రామంజినేయులు, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బొడగల శంకర్, కోశాధికారి పారాళ్ల పుల్లయ్య, సభ్యులు జింకా నాగభూషణ, గోలి నాగభూషణ, గడ్డం రామకష్ణ, జింకా మోహన్ బాబు, కట్టా గోవిందు, పోలంకి పెద్ద రెడ్డప్ప, జింకా రెడ్డప్ప, నాలుగు రాష్ట్రాల పద్మశాలీయ కుల బాంధవులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతిమ రోజులు : టిడిపి

ర్యాలీలో పాల్గొన్న పరిటాల సునీత, తదితరులు

ధర్మవరం టౌన్ : వైసిపి అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులు కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సోమవారం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించే ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చింతవులుసు పెద్దన్న, చింతలపల్లి మహేశ్, చారుగుండ్ల ఓబుళేశు, పరిశేసుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, ప్రకాశ్, గంగారపు రవి, బొటుకిష్ట, మారుతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : తాము అధికారంలోకి వచ్చిన తరువాత పర్మినెంట్ ఉద్యోగాలు ఉంటాయని చెప్పిన సీఎం జగన్ ఇప్పుడు ఏకంగా మూడు లక్షల మంది ఉద్యోగులను తొలగిస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. వారి భవిష్యత్తు కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కి పోరాటం చేస్తే తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆమె ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, రైతుల ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నెట్టెం వెంకటేష్, రామ్మూర్తినాయుడు,బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భానుగోట నరసింహులు, సుధాకర్ చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు బట్టా సురేష్ చౌదరి, నాయకులు కసుమూర్తి వెంకటేష్, బిల్లే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పార్టీకి పూర్వవైభవం తీసుకురావటానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసులు, డాక్టర్ సురేంద్ర కోరారు. స్థానిక కొడికొండ చెక్‌పోస్టులోని రంగారెడ్డి పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి అంశం పై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజినప్ప, నియోజకవర్గ కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, తెలుగు మహిళా పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, కోడికొండ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్‌లోని పోస్టులను

పారదర్శకంగా భర్తీ చేయాలి

పుట్టపర్తి అర్బన్: సమగ్ర శిక్ష అభియాన్‌లోని సెక్టోరియల్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెక్టోరియల్ పోస్టుల నియామకం కొరకు విడుదల చేసిన నోటిఫికేషన్ లో కొన్ని పోస్టులు చూపించకుండా భర్తీ చేయడం సరికాదన్నారు. పోస్టుల నియామకంలో మార్గదర్శకాలు పాటించలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వివరాలు గోప్యంగా ఉంచి ఇంటర్వ్యూలకు పిలవడంలో ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. కనీస ఉత్తీర్ణత లేని వారిని కూడా ఇంటర్వ్యూలు పిలవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్వహించడం సరైనది కాదని ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి : రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు ప్లేస్మెంట్ కేటాయించిన తరువాత మాత్రమే వర్క్ సర్దుబాటు జరగాలన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఈ ధర్నా కార్యక్రమం ఉంటుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. జయచంద్ర రెడ్డి, కె. నాగేంద్ర, భూతన్న, నాయకులు జిహెచ్ బాబు, సీతా లక్ష్మి, సుధాకర్, మారుతి, శ్రీనివాస్ తదితరులు కోరారు.

ధర్మవరం టౌన్ : శ్రీ సత్యసాయి జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లోని సెక్టోరియల్ పోస్టుల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని యుటిఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక యుటిఎఫ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టోరియల్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్లో కొన్ని పోస్టులు చూపించకుండా భర్తీ చేయడం అపేక్షనీయమన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చినా పోస్టుల నియామకంలో మార్గదర్శకాలు పాటించడంల లేదన్న అనుమానాలను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు డిఇఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు భూతన్న, పిఎన్ సీతాలక్ష్మి, కోశాధికారి సుధాకర్, రాష్ట్రకౌన్సిలర్ ఎంవి మారుతిశ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, శ్రీనివాసులు, తాహెల్, హరిక్రిష్ణ, రమీజాబేగం, అడిట్ కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అమరాపురం : మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి ఇందిరమ్మకాలనీ వద్ద కర్ణాటకకు చెందిన వ్యక్తి ఉరివేసుకుని ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం లెక్కనపల్లికి చెందిన తిప్పేస్వామి (38) కుటుంబకలహాల కారణంగా జీవితం విరక్తి చెంది ఆంధ్ర సరిహద్దులోని ఎర్రగుంటపల్లి ఇందిరమ్మకాలనీ సమీపంలో చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ మధుసూదన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి

అమరాపురం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ (36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... చంద్రశేఖర్ అగళి మండలంలో బ్యాంకు పని నిమిత్తం శనివారం మధ్యాహ్నం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంలో వస్తుండగా కాచికుంట మలుపు వద్ద అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య రమ్య 9 నెలల గర్భిణి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బేల్దారికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రియాంకనగర్‌లో సెంట్రింగ్ పనులు చేస్తున్న రాజు అనే బేల్దారి విద్యుత్‌షాక్‌తో గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... పోతుకుంట బీసీ కాలనీకి చెందిన రాజు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ప్రియాంకనగర్ లో ఓ ఇంటి నిర్మాణ పనులలో భాగంగా సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగలకు గురయ్యాడు. తోటి కూలీలు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

చిలమత్తూరు : కొడికొండ చెక్ పోస్ట్ వద్ద సెబ్ అధికారులు నిర్వహించిన వాహనాల తనిఖీలో కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోరంట్ల గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా సెబ్ పోలీసులు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 63 హైవార్డ్స్ చీర్స్ విస్కీ టేట్రా ప్యాకెట్లలను స్వాధీనం చేసుకున్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

తనకల్లు : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కళాకారుల ద్వారా కొక్కంటి క్రాస్ లో హెచ్ఐవి, ఎయిడ్స్ పై వీధినాటక రూపంలో అవగాహన కల్పించారు..ఈ కార్యక్రమం లో జన జాగతి సిబ్బంది ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, ఒఆర్‌డబ్ల్యూ రమాదేవి, పిఇ అమ్మాజాన్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలుపుల : మండల పరిధిలోని గొల్లపల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న భవాని మాత ఆలయ నిర్మాణానికి టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన 5 లక్షల రూపాయలను గ్రామస్తులకు ఆదివారం అందజేశారు. దీంతో గ్రామస్తులు కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న 'కందికుంట'

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

పుట్టపర్తి రూరల్: మండలం పరిధిలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో స్వీప్ యాక్టివిటీ పోగ్రాంను ఆదివారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్, పుట్టపర్తి డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటరు యొక్క ప్రాధాన్యత, ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎపిసిసి అధ్యక్షులు

మడకశిర : మాజీ మంత్రి, మాజీ ఎపిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డిని నూతనంగా ఎంపికైన పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదివారం కలిశారు. ఈ మేరకు ఆయన ఆదివారం నీలకంఠాపురానికి వచ్చి రఘువీరారెడ్డికి కలిశారు. ఈసందర్భంగా గిడుగు రుద్రరాజును రఘువీరారెడ్డి సన్మానించారు.

కరపత్రాలు విడుదల

ధర్మవరం టౌన్ : ఈనెల 7న వైసిపి ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించబోయే జయహో బీసీ మహాసభను సంబందించిన కరపత్రాలను వైసిపి నాయకులు ఆదివారం విడుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ బిసిల అభివృద్ధి వైసిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, బిసి నాయకులు ఉడుముల రామచంద్ర, చాంద్‌బాషా, కత్తేపెద్దన్న బాలం గోపాల్, సుభాన్, కరీం, తీరాల వెంకటరమణ, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, బాలం ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి

హిందూపురం : కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్య అతిథులు ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, మాజీ ఎమ్మెల్యే పార్థ సారథి, బిసి కమిషన్ మెంబర్, విశ్రాతం న్యాయమూర్తి కిష్టప్ప పేర్కొన్నారు. కనకదాసు 535వ జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మేళాపురంలో కనకదాసు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరెడ్డిపల్లి నంది సర్కిల్ నుంచి మేళాపురంలోని కనకదాసు విగ్రహం వరకు మహిళాలు కళాశాలజ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. దీంతో పాటు చెక్కభజన, గొరవయ్యల విన్యాసాలతో వెండి రథంపై కనకదాసు విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ కురుబలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ కురుబసంఘం కళ్యాణమండప నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.20 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు, జిల్లా యువత అధ్యక్షులు బుల్లె లింగప్రసాద్, ఎఐసిసి మెంబర్ శ్రీధర్, విగ్రహ దాత శాంతమ్మ, డాక్టర్ నరేష్, విశ్రాంత ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కురుబ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోపాల్, రెడ్డప్ప, కౌన్సిలర్ శివ, లక్ష్మి మహేష్‌గౌడ్, ముదిరెడ్డిపల్లి, మేళాపురం సంగం అధ్యక్షులు శంకరప్ప, ఉపాధ్యక్షులు రామలింగప్ప, సెక్రటరీ లక్ష్మీనారాయణ, కోశాధికారి బాలాజీ, సలహాదారుడు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రజా సమస్యలు రాజ్యమేలుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి విమర్శించారు. ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి పట్టణం 34 వార్డులో జనసేన జనబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వార్డులో పర్యటిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, స్థానిక కౌన్సిలర్ ఎన్నికల సమయంలో మాత్రమే కన్పించారని వారు ఇంతవరకు తమ కాలనీ లోకి రాలేదని కాలనీవాసులు వాపోయారు. ఇక్కడ పారిశుధ్యం పడకేసిందని సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని విమర్శించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని అలాగే సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమస్యను పరిష్కరించకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్ అలీ ,రామాంజనేయులు, తిరుపతేంద్ర, టౌన్ అధ్యక్షులు చలపతి, మండల అధ్యక్షులు మహేష్, రమణ ,చౌదరి ,కుటాల లక్ష్మణ్, 34 వ వార్డు కమిటీ అధ్యక్షులు హరిబాబు, రాజ పాల్గొన్నారు.